# పూలహా - రాళ్ళా

"రేపు...మంత్రిగారూ మనూరొస్తారట! కొళాయిలు వేయిస్తాడట! ఇంకా ఏమేమిటో చేస్తాడట! పెద్ద సభ జరుగుతుందట. ఊరేగింపూ, ఉపన్యాసం, అన్నీ వుంటాయట. లారీలలో మనుషుల్ని తోలుకొస్తారట పల్లెటూళ్ళ నుంచి. టౌన్‌లో వున్న ట్రాక్టర్లూ, లారీలూ, సైకిళ్ళూ ఊరేగింపు ముందు నడవాలట!" గుక్క తిప్పుకోకుండా చెబుతున్న శాయి మాటలకు చుట్టూరా వున్న పూల అంగళ్ళ వాళ్ళందరూ శ్రద్ధగా తలాడిస్తున్నారు వింటున్నట్లు! ఈ మధ్యే మునిసిపాలిటీగా మారిన ఆ టౌన్లో .... మొదటి మార్పుగా పూల అంగళ్లన్నీ కేటాయించినట్లు ప్రక్కగా వుంచటం జరిగింది.

"ఆ పోరే సోద! ఎవరు చెప్పారు నీకిదంతా!" చిన్న పాతబెంచి చుట్టూరా, నాలుగు గెడకర్రలు పాతి, వాటి మీద నుంచి అతుకులు వేసిన "గోనె గుడారం"లో, బెంచీమీద చిన్న చిన్న రాసులుగా పోసివున్న పూలను దండగా కడుతూ కూర్చుని వున్న వీరాయి కుతూహలంగా అడిగాడు. శాయి ఉత్సాహంగా వీరాయి ముందుకువచ్చి, బెంచీకి ఆనించి వున్న వీరాయి కొయ్య కాలును అటూ ఇటూ తిప్పుతూ, గొప్పగా అన్నాడు. "భలేవాడివే వీరాయి మావా! నాకు తెలీని సంగతులు ఏమిటీ వూళ్ళో! కలక్టరాఫీసుకూ, ఇంకా అన్ని

ఆఫీసులకూ టెలిగ్రాము లొచ్చాయట కూడాను! అంతా పరుగుతీస్తున్నారు పూలకోసం....ఫలహారాలకోసం....''

శాయి మాట లిక వినిపించలేదు వీరాయికి. పూలకోసం. పూలకోసం అన్నమాటలు మళ్ళీ మళ్ళీ వినిపించ సాగాయి. పూల మాలలు కావాలని ఈ రోజే పెద్ద పెద్దోళ్ళంతా వస్తారు, ఈపూల అంగళ్ళ దగ్గరికి! తనకూ, తన భార్య మల్లికీ, పెద్ద కొడుకు నారిగాడికీ చేతినిండా పని! ఈ మధ్య నెలా రెణ్ణెల్లుగా, ఒక రోజు తిండివుంటే, రెండ్రోజులు అందరికీ ఒక్క పూటైనా కడుపు నిండటంలేదు! ఎటుచూచినా పూల రాసులే! అందులో ఎక్కువమంది ఇక్కడ పూలమ్మేవారు.... స్వంత పూలతోటల ఇలాకా మనుషులే! మల్లెలూ, గులాబీలూ. మరువం, దవనం, అమ్మినవరకూ అమ్మి, అమ్మడుపోనివీ, వాడిపోతాయనిపించినవీ, కారుచౌకగా అమ్మిపారేసి వెళతారు! కానీ, తనలా కాదే? తోటలవాళ్ల దగ్గర పూలుకొని, అవి చౌకగా అమ్మితే తనకు గిట్టుబాటు కాదు. అదయినా మల్లిగానీ నారిగాడుగానీ అమ్ముకురావాలి మల్లి అమ్మినరోజు, పూల ఖరీదుపోను, తిండికి సరిపోతుంది గానీ, నారిగాడు వెళితే ఆ పన్నెండేళ్ల పసివాణ్ణి కొందరు మోసం చేసి సరిగా డబ్బు లివ్వరు! రేపిస్తాం రమ్మంటారు! ఎక్కువ మంది ఇల్లాళ్ళు అదరించి, బెదిరించి మూర సరిగా కొలవ లేదనీ, కొసిరి. కొసిరి పూలు ఎక్కువ తీసుకుని, డబ్బుసరిగ్గా ఇవ్వరు.

అసలు తనిలా పూలదగ్గర చతికిలపడి పోవలసింది కాదు! కూలికీ నాలికీ పగటివేళ వెళ్తూ, రాత్రివేళల లారీల

దగ్గర బస్తాలు మోస్తూ. రోజుకు ఐదారూపాయలు సంపా దించే వాడు ? మల్లెపువ్వులాటి మల్లి కాపురానికొచ్చి, తిండి సౌకర్యం కలగడంతో, తనకూ కండ పుష్టి బాగా చేకూ రింది! ఇద్దూము (రెండు తూములు) బస్తానైనా అవలీలగా మోసుకు రాగల అపరభీము డనేవాళ్ళు .... తోటి కూలీ లంతా! మల్లి చిన్నప్పట్నుంచీ ఎలా నేర్చుకొందో. పూల మాలలూ, పూలు కట్టడం బాగా చేతనౌను! తీరిక చేసు కొని కాసిన్ని విడిపూలు కొని .... మాలకట్టి చుట్టు ప్రక్కల కాస్తంత కలిగిన వాళ్ళిళ్లకు వెళ్ళి అమ్ముకు వచ్చేది రూపాయో అర్థో లాభం సంపాయించేది!

"నేనుండగా నీ కెందుకే ఈ కష్టం మల్లీ!" అని తనంటే ....

"తోచక లే మాఁవా!" అని నవ్వేసేది విరిసిన మల్లె లాటి ఆ నవ్వు, తనకు వెయ్యేనుగుల బలం ఇచ్చేది!

కానీ... నారిగాడు, సుబ్బులు పుట్టాక కూడా, మిస మిస లాడుతున్న మల్లిని....ఆ వీధి చివరన వున్న ఇన్స్పెక్టరు గారు....

"మల్లెలావున్నావ్ ! నీకీ పూలమ్మటమేం ఖర్మ!" అంటూ కన్ను గలిపాడని తెలియగానే .... వీరాయికి వీరా వేశంవచ్చింది! ఆయన అంతేదో చూస్తానంటూ బయల్దేరితే, మల్లే వారించింది! ఆరోజుతో "ఇక నువ్వు పూలమ్మవద్దు! నే తెచ్చిందేదో .... కాస్తఉడకేసి పెట్టుచాలు!" అనికట్టడి

చేశాడు. మల్లి కూడా సరేనంది....మూడోవాడు, రాములు. వాణ్ణి కడుపుతో వుంది మల్లి.

ఆ రాత్రి .... అది కాళరాత్రి .... తన జీవితంలోకి 'శని' త్రోసుకు వచ్చిన రాత్రి....

లారీలో నుంచి చివరిబస్తా వీపుమీద వేసుకుని భారంగా అడుగు వేయబోతున్న తనని....కదలి వెళ్లాడనుకుని లారీ రివర్స్ చేశాడు లారీడ్రైవర్ .... తను ప్రాణాలు దక్కించుకోగలిగాడే గానీ....కాలు దక్కించుకోలేక పోయాడు.

ఆ తర్వాత కొన్నాళ్ళు .... కాదు కొన్నేళ్ళు....నరకం మరెక్కడో లేదన్నంత భయంకరంగా సాగాయి రోజులు!

నారిగాడికి ఆ రేళ్లు .... సుబ్బులుకు మూడో ఏడు.... మళ్లీ గర్భిణిగావున్న మల్లి! కాలుతీసివేసి, కొయ్యకాలుతో నడుస్తున్న తను!

లారీ ఓనరు 'రాజీ' గా కాలుఖరీదు కడుతూ ఇచ్చిన మూడు వందల రూపాయలూ, తోటి కూలీలూ, బంధువులూ....దయతో తలకొకటిగా ఇచ్చిన ఏభై రూపాయలూ, మల్లి కాన్పు అయ్యేంత వరకూ తిండి జరిపాయి.

కాలులేని తను కూలికి పనికిరాడు! బిడ్డకు రెండు నెలలు కూడా రాకుండానే....మల్లి కూలికి వెళితే, ఎట్లాగో పూట జరిగేది!

"కుంటోడు! వాణ్ణి ఒదిలెయ్! మేం నీకూ. నీ పిల్లలకూ ఏ లోటూ రాకుండా చూస్తాం!" అన్న అభ్యర్థనలెన్నో మల్లికి ప్రతిరోజూ ఎదురయ్యేవి.

రోష పడటానికీ, సహించటానికీ కూడా వీల్లేని సంధి నరకం !

అయితే మల్లి గుణం బంగారంలాంటిది ! కష్టం వచ్చిందని ఒదిలేసి పోలేదు ! అదే ఓదారి చూపించింది.

"పూలు కట్టడం నీకు నేర్పుతాను మావా ! పూలు కొనుక్కు వస్తాను ! పెద్దాడికీ కాస్త ఊహ తెలుస్తున్నాది .... ఎలాగో పూట గడుపుకుందాం !" అంది.

ఛీ....ఛీ.... అడదానిలా పూలు కట్టడమా ?" అన్న అర్థంలేని అభిమానాన్ని ఆకలి జయించింది.

ఏ సీజనులో ఏపూలు వస్తే, ఆ పూలు కొనటం, కట్టటం, అమ్మటం.... ఓ మోస్తరుగా రోజులు గడిచి పోతున్నాయి.

ఐదేళ్ళు గిర్రున తిరిగే సరికి టౌన్‌లో జనాభా, మేడలూ సినిమాహాళ్ళు పెరిగినట్లే పూలఅంగళ్ళూ పెరిగాయి. 'పూల మాలలకు' గిరాకీ ఎక్కువైంది. పెళ్ళిళ్లూ దేశనాయకుల పర్యటనలు పూలమాలలు లేంది జరగవు గదా ? ఎలక్షన్స్ జరిగిన మరునాటినుంచి, షుమారు ఆరేడు నెలలవరకూ గెలుపొందినవారిలో, ఎక్కువ మంది ఎం. ఎల్. ఏ లకూ, ఎం. పీలకూ, మంత్రులకూ సన్మాన సభలూ, పూలమాలలే మొదటి 'ప్రజా సమస్య' గా ఎదురౌతున్నాయి ! టౌన్ చుట్టు ప్రక్కల పూల తోటలు పెరిగిపోయాయి. ఇంతక్రితం పూల తోటల పెంపకం అన్నది తీరిక సమయంలో చేసేపని అయితే, ఇప్పుడది ప్రధాన వృత్తిగా మారిపోయింది.

స్వంత తోటలుగల వాళ్ళే చిన్న చిన్న అంగళ్ళు పెట్టించి, నమ్మకమైన తమ మనుషుల్ని పెట్టి అమ్మించుకుంటున్నారు—తోటల వాళ్ళదగ్గర విడిపూలు కొని, మీరు బేరానికి అమ్మే బ్రోకర్లూ తయారయ్యారు.

"ఏమిట్రా వీరాయ్! ఏమిటో దీర్ఘాలోచనలో వున్నావ్!" మస్తాను భుజంమీద చరిచిన చరుపుకు త్రుళ్ళి పడ్డాడు వీరాయి.

"ఏంలేదు! రేపెవరో మంత్రిగారు వస్తారటగా?" అన్నాడు.

ఊ! పెద్ద ఎత్తుగా వుంటుందట ఊరేగింపు. ఎన్నో సంస్థల తరఫున....అడుగుకో పూలమాల వేస్తారట! కానీ.... మాంఛి ధర పెంచేద్దాం!" అన్నాడు మీసం మీద చెయ్యివేసి మెలిదిప్పుకుంటూ.

"ధర పెంచితే కొంటారంటూవా?" సందేహిస్తూ అడిగాడు వీరాయి.

మస్తాన్ విరగబడి నవ్వాడు "కొనకేం జేస్తార్రా వీరాయ్! నీకు అనుభవంలేదు ఆలోచనా లేదు. అందుకే నువ్విట్లా .... ఆరేళ్ళుగా పూలమ్ముతున్నా నువ్వూ, నీ పూలూ, ఎండలో....గోనెపట్టు గుడారంలో వున్నారు!" హేళనగా అన్నాడు మస్తాన్. అతగాడీ మధ్య నాలుగు వందలు పెట్టి బంకు కొన్నాడు.

వీరాయి పలకలేదు.

"ఎవరికోసం కొంటార్రా! పూల మాలలు! వాళ్ళ అవసరమా? మనవసరమా? మన పూలు అమ్ముడుపోనప్పుడు ఓ పైసాతగ్గించి పారేస్తాం! వాళ్ల అవసరమైనప్పుడు ఓ రూపాయి పెంచాలి! ఈ మాత్రం తెలీదూ? నీ కెందుకు! నువ్వట్లాగే చూస్తుండు. అంతా కట్టుగా వుండమని చెప్పాను అందరికీ! పెదవిమెదప వద్దు ఎవ్వరూ! పూలమాల....సాదా రకం అయినాసరే....యాభైరూపాయలు తక్కువ కాదని చెబుతాను! చచ్చినట్లు కొంటారు! మాల లేకుండా మంత్రిగారెలా ఊరేగుతారు?" మస్తాన్ ఆసరికే అందరికి ఇలాటి హెచ్చరిక చేసివచ్చాడని తెలిసిపోయింది వీరాయికి. మస్తాన్‌కు ఇద్దరు కొడుకులూ, ఇద్దరు మేనల్లుళ్ళూ; కూలికీ, రిక్షాకూ, ఫ్యాక్టరీకీ, పూలమ్మకానికీ వెడతారు. ఆకలి అట్టే తెలియని మనిషి. పూలతోటల బ్రోకర్లలో ఒకడు.

వీరాయికి మస్తానుమాట లెప్పుడూ నచ్చవు. ఎదుటి వాళ్ల అవసరం అంటే అన్యాయంగా ధర పెంచడం పాపం కాదూ?

న్యాయమైన ధరకే నాలుగు మాలలు అమ్ముడుపోయినా పూల ఖరీదుపోను తనకో పాతిక రూపాయలు మిగులుతాయి! ఆమాటే మల్లితో అన్నాడు.

"ఔను మావా! మన కష్టం మనకు చాలు? అత్యాశ వద్దు!" అంది.

"నిలువెత్తు పూలమాల కావాలి. మంత్రిగారి మెడలో పూలమాల వేస్తే మంత్రిగారు కనిపించనంత ఎత్తుగా,

...అందంగా, హుందాగా వుండాలి మాల! మల్లెలు, గులాబీలు, చెమ్కీదారం.... తామరలు వేసి... నభూతో నభవిష్యతి అన్నట్లుండాలి.... ఎంతకు కడతారు?" తన చుట్టూ మూగివున్న పూల అంగళ్లవాళ్లతో అన్నాడు పూలమాలల కాంట్రాక్టరు.

ఎవరూ పలకలేదు. మస్తాన్ నాయకుడిలా చేతులు కట్టుకుని నిల్చుని వున్నాడు....

"....ఆ పూలమాల పేపర్లలో ఫోటోల్లోపడుతుంది ...! చెప్పండి!" టెంప్ట్ చేస్తున్నట్లు అన్నాడు కాంట్రాక్టరు ....

"మీరు చెప్పేవన్నీ వేసి మీరు చెప్పినంత సైజులో కట్టాలంటే.... కనీసం మూడు వందల రూపాయలపైన అవుతుంది!"

మస్తాన్ మాటలకు కంట్రాక్టరుతో బాటు వీరాయి కూడా అదిరిపడ్డాడు.

"మూడు వందలే!" కాంట్రాక్టరు పెద్దగా, వీరాయి లోలోపల అనుకున్నాడా మాటలు.

"అవును." మస్తాన్ దృఢంగా అన్నాడు. "సాదాగా కట్టే పెళ్ళిమాలలే పాతిక పలుకుతోంది సార్! మరి నిలువెత్తు పూలమాల.... అందునా.... గొప్పవారికి!"

"అవునవును." మిగతా గొంతుకలు వంత పాడాయి.

ఊహూఁ! మరో జేరం!

"రెండువందల యాభై....అంత కిక పైసాతగ్గేదిలేదు." మస్తాన్ దృఢంగా చెప్పాడు.

ఊహూఁ నూటయాభై ఇస్తాను. ఎవరు కట్టిస్తారు"

ఎవరూ ముందుకు రాలేదు.

"ఇక్కడ కాకుంటే, మరోటౌన్నుంచి తీసుకవస్తాం!" కాంట్రాక్టరు బింకంగా అన్నాడు.

వీరాయి చటుక్కున అన్నాడు "నేను కట్టిస్తానండీ!"

మస్తాన్తోబాటు మిగతా అందరూ మిర్రి చూశారు వీరాయివేపు. అందరికీ గుర్రుగావుంది, తమలో ఒకడిలా మెత్తబడటం!

"భేష్! అలావుండాలి న్యాయంగా పోవాలి ఎవరేనా! ఇదుగో పాతిక రూపాయలు అడ్వాన్స్....సరిగ్గా రేపు సాయంత్రం నాలుగ్గంటలకు వస్తాను .... మాల రెడీగా వుండాలి...."

"అట్టాగేనండీ .... అదుగో ఆ కనిపించే సందులో మూడో గుడిసే నాది .... అక్కడే వుంచుతాను మాల కట్టి...."

"సరే! సైకిలెక్కి వెళ్ళిపోయాడు కాంట్రాక్టరు! ఆ పూలమాల 'ఎర' గా పెట్టి మంత్రిగారికి చేరువ గావాలనుకుంటున్నాడు కాంట్రాక్టరు! ఇతగాడి అన్న, మంత్రిగారూ, చిన్నప్పుడు హైస్కూల్లో కలిసి చదువుకున్నారట!

మస్తాన్ మండిపడ్డాడు వీరాయిమీద "మరి కాస్సేపు నోరు మూసుకుని వుంటే రెండు వందల యాభై కక్కే వాడు .... అడ్వాన్సుగా సగం డబ్బయినా ఇప్పించుకోలేదు! మొనగాడు!" తలోరకంగా తిట్టారు. దెప్పారు. వీరాయి వినిపించుకోలేదు.

మల్లి చేతిలో పాతికా పెట్టి పూలు, చెమ్కీ, నారా పట్టుకు రమ్మన్నాడు. రాత్రంతా గుడిసెలో నేలమీద వేలితో, మాలలో మూరకో రకంగా 'షేప్' తీసుకురావా లని - చిత్రిస్తూనేవున్నాడు.

తెల్లవారు ఝామున రిక్షాలో మల్లి, పెద్ద కొడుకు నారిగాడూ, బుట్టలతో పూలు పట్టించుకు వచ్చారు. రాశి పోసిన పూలు, చెమ్కీ, మొగ్గలుగా వున్న తామరలు, గులాబీలూ ........ "గిరాకి అని తెలిసి పూల ధర మరో రూపాయి పెంచేశాడు ఆ రవణయ్య" అంది మల్లి పూల గుట్టలు సర్దుతూ,

"పోనీయ్! మాల గొప్పగా చేశామంటే, ఆ రూపా యలు .... మనకి మెహర్బానీగా ఇస్తార్లే..." సంతోషంగా అంటూ పని కుపక్రమించాడు వీరాయి.

ఒక్క క్షణం ఆలస్యం చేసేందుకు లేదు మల్లి, నారి గాడు, వీరాయి ముగ్గురి వ్రేళ్ళూ మిషన్సులా మారాయి! పుల్లకు పూలు ఎక్కటం, నారమీదికి వెళ్ళటం, నారవాటి చుట్టూరా బిగుసుకు పోవటం, మల్లెల మధ్య గులాబీలు ఒదిగి పోవటం, చెమ్కీ సుతారంగా చుట్టు తిరగటం, కనురెప్ప పాటు కాలంలో జరిగిపోతున్నాయి!

వీరాయిలో ఒకే ఆవేశం... ఆలోచన. మాల గొప్పగా కుదరాలి....మంత్రిగారే ఆశ్చర్యపోవాలి. ఫొటోలో గొప్పగా పడాలి, కాంట్రాక్టరు మెచ్చుకుని మరో పది రూపాయలు మెహర్బానీగా ఇవ్వాలి! మరోసారి, మరోసారి....తనకే ఆర్డరు రావాలి పూల మాలకు!

"రెండు గంటలు దాటింది. ఇక అన్నాలు తిందాం మాఁవా!" అంది మల్లి....

"తిందాం లేవే. మాల నాలుగ్గంటలకల్లా రెడీ కావాలి? ఇంకా ఓ మూర మిగిలివుంది!" అలసటా ఆనందం నిండిన కంఠ స్వరంతో?

మాల పూర్తయింది. కొయ్యకాలు సాయంతో లేచి నిలబడి .... చెయ్యెత్తి మాల ఎత్తి పట్టుకుని చూశాడు వీరాయి! 'అద్భుతంగా వుంది!' అందతగాడి హృదయం తృప్తిగా. మల్లి మెప్పుగా తలాడించింది. నారిగాడు "భలే వుంది!" అంటూ ఎగిరాడు.

సైకిల్‌బెల్ వినిపించింది బయట. "అయిందా మాల?" కాంట్రాక్టరు లోపలికొచ్చాడు. "అయిపోయింది!" మాల బుట్టలో సర్ది ఇచ్చాడు వీరాయి. కాంట్రాక్టరు బుట్ట సైకిల్ వెనక పెట్టుకున్నాడు.

"అరె! పర్స్ మర్చిపోయాను....పోనీ, మీ యిద్దరిలో ఎవరో ఒకరు సభ జరిగేచోటుకు రాకూడదూ? అక్కడిచ్చేస్తాను డబ్బు!" అన్నాడు తొందర తొందరగా వాచీ చూసుకుంటూ.

''అట్లాగే, తమరి దగ్గర డబ్బు ఎక్కడికి పోతుంది?'' అన్నాడు వీరాయి వినయంగా....

తలా కాస్త తిండీ తిన్నారు.

ఊరంతా కోలాహలం ఔట్లు పేల్చటం, రంగురంగుల బాణా సంచా దీపావళి రోజులా వుంది !

ఊరేగింపు....మంత్రిగారు ట్రెయిన్‌లో నుంచి దిగింది మొదలు .... కారులో కూర్చునే వరకూ, కారు కదిలింది మొదలు, అడుగడుక్కూ ... ఎవరెవరో, పూలమాలలు వేస్తూనే వున్నారు పూలమాలల గుట్ట పడతోంది కారులో! మస్తాన్ అధ్వర్యంలో పాతికచేసే పూలమాల యాభైకి పెరిగింది ! ఆ మాలలే ఇవన్నీనని వీరాయికి తెలుసు.

నల్లని మంత్రిగారు, తెల్లని పూలమాలల మధ్య రాతి విగ్రహంలా .... ఉన్నాడని చమత్కరించారు ఓ కవిగారు గుసగుసగా !

''ఇక నేనుండవ లేను మల్లీ! ఆ కంట్రాక్టరు నడిగి డబ్బు తీసుకు ఇంటికి రానువ్వు; పిల్లల దగ్గరుంటా న్నేను!'' అన్నాడు వీరాయి అలసిపోయి ! స్టేషన్ దగ్గర్నుంచి ఊరేగింపుతో నడిచి వచ్చేసరికి ప్రాణం చాలొచ్చింది. కాంట్రాక్టరు మంత్రిగారి వెనకాలే తోకలా వున్నాడు.

''అట్లాగే!'' అంది మల్లి.

సభ ప్రారంభం కాగానే, ఓ ప్రముఖ సంస్థ తరపున, వీరాయి నిలువెత్తు పూలమాల .... మంత్రిగారి మెడలో

వేశాడు కాంట్రాక్టరు. ఆ మాలతోనే ఫొటోలు తీశారు పత్రికల వారు. తర్వాత ఇద్దరు మనుష్యులు పూలమాలను తీసేశారు మంత్రిగారి మెడలో నుంచి. అది కారులో వుంచ బడింది

సభ ఎంతకి పూర్తి కావటం లేదు. ఒకరి తర్వాత ఒకరుగా ఎవరెవరో ఏదేదో ఉపన్యాసం చెబుతున్నారు. అదేమిటో అంతుబట్టటంలేదు మల్లికి విసుగ్గావుంది, ఆ కంట్రాక్టరు 'ఇదుగో వస్తా' అంటూనే వేదికమీదికి పరు గెత్తాడు.

పన్నెండు గంటలు దాటుతుండగా సభ పూర్తయ్యింది. జనం తోసుకుంటూ తొక్కుకుంటూ వెళ్తున్నారు ఇళ్ళకు (లారీల దగ్గరకూ!)

మంత్రిగారితో చాలామంది ఆఫీసర్లు మాట్లాడి శలవు తీసుకుంటున్నారు ఎవరో 'అతి ముఖ్యులు' ఒకరిద్దరు తప్ప తనతో బంగళాకు మరెవరూ రానవసరం లేదని స్పష్టంగా చెప్పారు మంత్రిగారు .... టౌన్ బయట ఉన్న ఐ. బి. లో ఆయనగారి బస!

పిల్లలు అన్నం తిన్నారో లేదో .... చాలా దూరం నడిచి వెళ్ళాలి ఇంటికి. కాస్తంత సందు దొరకగానే, మల్లి గబగబా కారు దగ్గరికి వెళ్ళింది .... మంత్రిగారు కూర్చుని వున్నారు, మరెవరో ఓ ప్రముఖుడూ, కాంట్రాక్టరూ వెనక సీట్లో కూర్చుని వున్నారు. కంట్రాక్టరు వేపు చూస్తూ మల్లి అడిగింది: "పూలమాల డబ్బు ..." ఆమె నోట్లో మాట

నోట్లో వుండగానే కాంట్రాక్టరు మిర్రిచూశాడు "ఛస్.... ఇక్కడా ఆ సంగతి ?"

ఏం తప్పో అర్థంగాలేదు మల్లికి.

"ఏమిటి ? ఎవరామె ?" ఇంగ్లీషులో అడిగారు మంత్రి గారు.

వచ్చీరాని ఇంగ్లీషులో సంగతి చెప్పాడు కంట్రాక్టరు.... డబ్బు ఎంతివ్వాలన్నది మాత్రం చెప్పకుండా !

"చాలా అందంగావుంది?" మంత్రిగారు ఇంగ్లీషులో అని అర్థయుక్తంగా నవ్వారు !

ప్రముఖుడు పసిగట్టాడు.... కాంట్రాక్టరుతో గుసగుస లాడాడు....

"ఓ దానికేముంది. పూలమ్ముకొనే మనిషి .... దట్సాల్!" అంటూనే కారుదిగి వచ్చి.... మెల్లిగా అన్నాడు మల్లితో కాంట్రాక్టరు. "ఆ వెనక.... పూలమాలలున్న కార్లో కూచో.... బంగళా దగ్గర డబ్బిచ్చేస్తాం ! వెధవది, అవసర మేమిటని డబ్బు పట్టుకురాలేదు ! అయినా నీ డబ్బివ్వమని నీకు భయమెందుకు ?"

పూలమాలల గుట్టల మధ్య కారులోకూర్చున్న మల్లి లోలోపల అనుకుంది "భయం కాదు నాయనా! మా ఆకలి తంత్రి అది ! ఇంటి దగ్గర ఒంటరిగా పిల్లలూ, మాంవా ఎట్లా అవస్థ పడుతున్నారోనని....' ఆ ఆలోచనతో ఆ పూల సువాసన ఆమెకు ఆహ్లాదాన్ని కలిగించటం లేదు!

బంగళాలో మంత్రిగారు దిగారు. పూలమాలలన్నీ వాచ్ మెన్ లోపల పెట్టాడు. వరండాలో నిల్చుంది మల్లి ....

మంత్రిగారితో ఏదో మాట్లాడి, ప్రముఖుడు శలవు తీసుకున్నాడు పూలమాలలు వచ్చిన కారు కదిలిపోయింది! కంట్రాక్టరు బయటికి వచ్చాడు.

"నీకు డబ్బివ్వాలికదూ?" అన్నాడు అదోలా నవ్వుతూ.

"ఊఁ" నీరసంగా అంది మల్లి.

"అయ్యగారూ.... గొప్పవారు.... నిన్ను ఈ రాత్రికి .... చాలా డబ్బిస్తారు___" నంగి నంగిగా అన్నాడు.

మల్లికి అర్థంకాలేదు "పూలమాల డబ్బు?" అంది అసహనంగా.

"అదలా వుంచు .. దానికి రెండింతలు...." అతగాడి వెకిలి చూపులు, సైగలూ _ కొంతవరకూ అర్థం చెప్పాయా మాటలకు....

ఆమె హృదయం భగ్గుమంది. ఇంతదూరం ఒంటరిగా.. కారులో పిల్చుకు వచ్చిందిందుకా!

"మాటలు మర్యాదగా రానీ.... నాకు రావలసినడబ్బు ఇటివ్వు!" అంది కోపంగా అరుస్తూ.

వాచ్ మెన్‌కిది వింతగా వుంది? ఎందరో సొసైటీ లేడీస్ .... కిమ్మనకుండా ఒప్పుకుంటూండటం .... తమంత

తాపుగా రావటం ... అతను చూశాడు ... వెధవది .... పూలమ్ముకునే మనిషి....ఇలా దబాయించటం....

విగ్రహంలాంటి మంత్రిగారూ వరండాలోకి వచ్చారు. ముద్ద ముద్దగా మాట్లాడుతూ "ఏమిటీగోల! ఇలాంటి చదువూ సంధ్యా లేని....రాళ్ళలాంటి మనుములతో మాటలేమిటి ? లెట్ హెర్ గో టు హెల్ .... సంస్కారం లేని....థూ .... థూ ! అనదర్ లేడీ...దట్ జంటిల్ మన్స్ వైఫ్....విలకం ......." అన్నారు కోపంతో ఊగిపోతూ.

మల్లికా ఇంగ్లీషేమిటో అర్థం గాలేదు—

"నా డబ్బు...."

"ఛస్. డబ్బు .... డబ్బు .... ఇదిగో ..." ఐదు ఐదు రూపాయల నోట్లు విసిరేశాడు కంట్రాక్టరు !

నోట్లవేపు కళ్ళు విప్పార్చి చూచింది మల్లి. పాతిక
"పాతికా ! మిగతాది?" అంది ఆశ్చర్యంగా ! !

"మిగతాదేమిటి ? నిన్న సాయంత్రమే ఓ పాతిక ఇచ్చాను ఇప్పుడో పాతిక ... మూల యాభై రూపాయలు .... అన్నీ కొనలేదూ?" కోపంగా అరిచాడు కాంట్రాక్టరు .... మంత్రిగారు లోపలికెళ్ళారు.

అలాగే అవాక్కుగా నిల్చునివున్న మల్లివేపు కోపంగా చూస్తూ .... "కావలిస్తే ఆమాల పట్టుకెళ్ళు .... వెధవది ఏడ్చినట్లుంది...." మరో రెండునిముషాలలో .... పూలమాల ఈడ్చుకుంటూ వచ్చి మల్లి కాళ్ళముందు పారేశాడు ! "గొడవ

చేశావంటే పోలీసులకు ఫోన్‌చేసి ..." కిటికీలోనుంచి చూస్తూ మంత్రిగారు హెచ్చరించారు ! వాచ్ మెన్ ఆమెను బయటకు గెంటడానికి సిద్ధంగా వున్నాడు !

మల్లి కాళ్ళ చుట్టూ నిలువెత్తు పూలమాల పరుచుకుని వుంది ! మల్లెలు విరిసి, గులాబీల రేకులురాలి....చెమ్కీ దారం మెరుస్తూ....ఆ సువాసన, ఆ అందం....ఆమెకు తెలియటం లేదు. పూలఖరీదుకూడా రాలేదు ! అది అప్పు తీర్చుకోవాలి ! శరీర కష్టం ! అవి చాలక....వీళ్ల వీళ్ల ప్రవర్తన....కోరిక....అవమానం ! ఆమె హృదయం రాయిలా వుంది.

"ఏం వెళ్లవూ?" అన్నాడు వాచ్‌మెన్....కాంట్రాక్టరు.

కాళ్ళ దగ్గరున్న పూలమాలను దాటి....కదులుతున్న రాయిలా కదిలింది మల్లి. ఆమె ఆ చీకటిలో .... అర్ధరాత్రివేళ నడవవలసిన దూరం ఐదు మైళ్లకు తక్కువ వుండదని....బంగళాకు కట్టిన రాళ్ళకు తెలుసేమోకానీ, బంగళాలో వున్న రాళ్లకు తెలియదు మరి !

(''తరుణ సెప్టెంబరు '72'')